క్లుప్తంగా

వెయిట్ లిఫ్టింగ్‌లో స్వర్ణం



బంగారు పతకం సాధించిన పుష్పాంజలి

కర్నూలు (టౌన్): ఈనెల 18వ తేదీ గుడివాడలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో కర్నూలు నగరానికి చెందిన పుష్పాంజలి సత్తా చాటింది. స్థానికంగా బాలశివ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న ఈ విద్యార్థిని బంగారు పతకం సాధించింది. ఈ సందర్భంగా ఆమెను శుక్రవారం వెయిట్ లిఫ్టింగ్ కోచ్ యూసఫ్‌తో పాటు కళాశాల యాజమాన్యం అభినందించారు.

పారిశుధ్యం లోపించకుండా చర్యలు

కర్నూలు (టౌన్): నగరంలో పారిశుధ్యం లోపించకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ ఎస్.రవీంద్రబాబు స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక జొహరాపురంలోని డంప్ యార్డును కమిషనర్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. పారిశుధ్యం నిర్వహణపై నిర్లక్ష్యం తగదన్నారు. అలాగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చే సమస్యలపై దృష్టి సారించి పరిష్కారానికి కృషి చేయాలని అధికారులకు సూచించారు. కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపడుతున్నామన్నారు. డీఈఈ మనోహర్ రెడ్డి, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌పై సమావేశం



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జిల్లా జడ్జి జి.కబర్థి

కర్నూలు (లీగల్): డిసెంబర్ 14వ తేదీన ప్రిన్సిపల్ జిల్లా జడ్జి, చైర్మన్ జి.కబర్థి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి అధ్యక్షతన లోక్ అదాలత్ జరగనుంది. ఈ నేపథ్యంలో శుక్రవారం కర్నూలు, నంద్యాల జిల్లా కలెక్టర్లు, పోలీసు సూపరింటెండెంట్లు, ఎక్సైజ్ అధికారులు, స్పెషల్ కలెక్టర్లు, కర్నూలు హెచ్ఎన్ఎస్ఎస్ యూనిట్-4లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి సంబంధించి సమావేశం నిర్వహించారు.

న్యాయశాఖ కార్యదర్శిగా జడ్జి ప్రతిభాదేవి

కర్నూలు (లీగల్): కర్నూలు నాల్గవ అదనపు జిల్లా జడ్జిగా పనిచేస్తున్న జి.ప్రతిభా దేవిని న్యాయశాఖ కార్యదర్శిగా నియమిస్తూ రాష్ట్ర హైకోర్టు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆమె రెండు సంవత్సరాల పాటు ఈ బాధ్యతల్లో కొనసాగుతారు. ఇప్పటివరకు న్యాయశాఖ కార్యదర్శిగా పనిచేస్తున్న వి.సునీతను రిలీవ్ కావాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ మేరకు జీఓ జారీ చేసినట్లు తెలిసింది.

సూపరింటెండెంట్ తనిఖీలు



ఆసుపత్రిలో పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు

కర్నూలు(హాస్పిటల్): ఆసుపత్రిలోని డైట్ విభాగంలో ఆహారం భుజించే వైద్యుల సంతకాలు తీసుకోవాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు చెప్పారు. శుక్రవారం ఆయన ఆసుపత్రిలోని పలు విభాగాలను తనిఖీ చేశారు. ఓపీ కౌంటర్లు, డయాగ్నోస్టిక్ బ్లాక్, మెడికల్ వార్డులు, టీబీసీడీ వార్డు, ఫార్మసీ డిస్పెన్సరీ, డైటిక్స్, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, పేయింగ్ బ్లాక్, పాలియేటివ్ కేర్ యూనిట్, ఆంకాలజీ, స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లను పరిశీలించారు. వేసవి కాలంలో ఔషధాల నిల్వ కోసం రూఫింగ్‌తో ఫార్మసీ డిస్పెన్సరీలో మరమ్మతులు చేయనున్నట్లు తెలిపారు. ఆసుపత్రి ఆవరణలో నీరు పొంగి ప్రవహిస్తుండడంతో ముగ్గురు వాటర్ మ్యాన్‌లకు మెమోలు జారీ చేయాలని సీఎస్ఆర్ఎంవోను ఆదేశించారు. ఆయా విభాగాల్లో సమస్యలను పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. డిప్యూటీ సీఎస్ఆర్ఎంఓలు డాక్టర్ శ్రీరాములు, డాక్టర్ సీతారామయ్య, సీఎస్ఆర్ఎంవో డాక్టర్ వెంకటేశ్వరరావు, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ డాక్టర్ శివబాలనాగాంజన్, డాక్టర్ కిరణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఉల్లి ధరలపై సిండికేట్ ప్రభావం!

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో వ్యాపారుల సిండికేట్‌తో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. శుక్రవారం ఉల్లి గరిష్ట ధర క్వింటం రూ.5వేలు దాటినప్పటికీ ఎక్కువ మంది రైతులకు క్వింటం రూ.3,500 వరకు మాత్రమే ధర లభించింది. మార్కెట్‌కు 206 మంది రైతులు 3,971 క్వింటాళ్ల ఉల్లి తెచ్చారు. ఒకటి, రెండు లాట్లకు మాత్రమే అధిక ధర కోట్ చేసి మిగిలిన లాట్లకు ధరలను అడ్డంగా కోసేశారు. కనిష్ట ధర రూ.495, గరిష్ట ధర రూ.5,099 లభించింది. సగటు ధర కేవలం రూ.3,388 మాత్రమే నమోదు అయింది. గురువారం గరిష్ట ధర రూ.4,509 లభించింది. సగటు ధర మాత్రం రూ.3,619 నమోదు అయింది. గురువారం నాటితో పోలిస్తే క్వింటాలుపై రూ.500పైగా ధర పెరిగినప్పటికీ సగటు ధర మాత్రం సన్నబడిపోయింది. ఉల్లి సాగులో పెట్టుబడి వ్యయం పెరిగిపోయినప్పటికి గిట్టుబాటు ధరలు లభించకపోవడం పట్ల రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.

సేవామయి.. సత్యసాయి

- నిరంతర సేవలో సత్యసాయి సేవా సంస్థలు
- నాలుగు దశాబ్దాలుగా ఆధ్యాత్మిక, సామాజిక సేవలో సాయి భక్తులు
- బాల వికాస్ తరగతుల్లో నైతిక విలువల బోధన
- నేడు భగవాన్ సత్యసాయి 99వ జయంతి వేడుకలు



శిబిరంలో రక్తదానం చేస్తున్న వలంటీర్లు (ఫైల్)



మగ్గం శిక్షణలో మహిళలు (ఫైల్)

కర్నూలు కల్చరల్: మానవ సేవే మాధవ సేవ.. అభాగ్యులకు.. అనాథ వృద్ధులకు అండగా నిలవడమే నిజమైన సేవ అని భగవాన్ సత్యసాయిబాబా చెప్పిన మాటలను స్ఫూర్తిగా తీసుకొని నిత్యం అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోంది కర్నూలులోని సత్యసాయి సేవా సమితి. బాబా మార్గాన్ని అనుసరిస్తూ ఆధ్యాత్మిక, ధార్మిక కార్యక్రమాలతో పాటు విభిన్న సామాజిక సేవా నిరతితో 41 ఏళ్లుగా సేవలందిస్తున్నారు సాయి సేవకులు. 1984లో సేవా సమితి ప్రారంభించి జిల్లావ్యాప్తంగా సామాజిక సేవలు అందిస్తున్నారు. శుక్రవారం భగవాన్ పుట్టపర్తి సాయిబాబా 99వ జయంతి ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

సేవా మార్గంలో..

ఆధ్యాత్మిక బోధనలతో పాటు సాయి భక్తులు సామాజిక సేవల్లోనూ ముందుండాలని భగవాన్ సాయిబాబా ఉద్బోధ చేశారు. ఆ మాటల స్ఫూర్తితో 1984 నవంబర్ 23న స్వామి 59వ జన్మదినం రోజున నెహ్రూనగర్‌లో సత్యసాయి మందిరం ప్రారంభమైంది. ఆనాటి నుంచి సేవా కార్యక్రమాలను విస్తృతంగా సాగిస్తోంది. కరోనా సమయంలో సైతం హోమ్ ఐసోలేషన్‌లో ఉన్నవారికి ఆహార సేవ అందించారు.

సాయి భక్తుల సేవా కార్యక్రమాలు..

- సత్యసాయి సేవా సమితి ఏడాదంతా ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోంది.
- ప్రధానంగా అన్నార్థులకు నిత్యాన్నదాన సేవ. ఎవరూ లేని నిరుపేద వృద్ధులకు రోజూ రెండు పూటలా భోజనం వండి క్యారియర్ల ద్వారా సరఫరా చేస్తున్నారు. ఉదయం 11 గంటలకు సాయంత్రం 7 గంటలకు నగరంలోని వృద్ధులకు వారి అన్నదానం చేస్తున్నారు.
- ఎవరూ లేని, వంటా వార్పు చేసుకునే శక్తి ఉన్న పేద వృద్ధులకు అమృత కలశం పేరుతో నెలకు సరిపడా నిత్యావసర సరుకుల కిట్ల అందజేత
- కప్పట్రాళ్ల గ్రామాన్ని దత్తతకు తీసుకొని ఐదు వేల లీటర్ల సామర్థ్యం గల మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు.
- ప్రతి ఆదివారం బాలవికాస్ పథకం కింద విద్యార్థులకు ఆధ్యాత్మిక, నైతిక విలువలపై తరగతులు నిర్వహిస్తున్నారు.
- నెహ్రూ నగర్‌లోని సత్యసాయి మందిరంలో ప్రతి ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తూ హోమియో అల్లోపతి మందులు ఉచితంగా అందజేస్తారు.
- మూడు నెలలకోసారి గ్రామీణ ప్రాంతాల్లో నేత్ర, దంత పరీక్షలు చేసి అవసరమైన వారికి కళ్లజోళ్లు, మందులు ఇస్తున్నారు. మహిళలకు గైనకాలజిస్టు ద్వారా వైద్య పరీక్షలు చేయిస్తున్నారు. నిరుపేద మహిళలకు శ్రీమంతాలు, కాన్పు సమయంలో మందుల పంపిణీ చేస్తున్నారు.
- పేద మహిళల ఆర్థిక పురోగతికి కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్నారు.
- మహిళా విభాగంచే మగ్గం వర్క్, కుట్టడంపై శిక్షణ.
- యువ విభాగం ఆధ్వర్యంలో వేసవిలో చెప్పులు, టోపీలు, పోలీసులకు మజ్జిగ, వర్షాకాలంలో గొడుగులు, చలికాలంలో దుప్పట్ల పంపిణీ.
- సామూహిక నక్షత్ర పూజలు, శ్రీమంతాల నిర్వహణ

నేడు సత్యసాయి జయంతి కార్యక్రమాలు ఇలా..

నెహ్రూనగర్‌లోని శ్రీ సత్యసాయి సేవా సమితి మందిరంలో భగవాన్ సత్యసాయిబాబా జయంతి కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఉదయం 5.30 గంటలకు ఓంకారం, సుప్రభాతం, 6 గంటలకు నగర సంకీర్తన, 7 గంటలకు అష్టోత్తర పూజ, పతాకావిష్కరణ, భజన, 7.30 గంటలకు సత్యసాయిబాబా వారికి రుద్రాభిషేకం, భజన, మంగళహారతి, సాయంత్రం 5.30 గంటలకు వేద పఠనం, 6 గంటలకు భజన, 7 గంటలకు ఉత్సవాలు, స్వామి సందేశం, మహా మంగళహారతి, ప్రసాద వితరణ కార్యక్రమాలు జరగనున్నాయి.



సత్యసాయి చిత్రపటం ఊరేగింపులో మహిళా సేవకులు

అన్నదానం

కర్నూలు కల్చరల్: భగవాన్ శ్రీ సత్యసాయిబాబా జయంతి పురస్కరించుకొని సత్యసాయి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం నారాయణ సేవా కార్యక్రమం నిర్వహించారు. నగరంలోని అనాథ, వృద్ధాశ్రమాల్లోని నిర్భాగ్యులకు ఆహార పదార్థాలను పంపిణీ చేశారు. సాయిసేవా ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, కర్నూలు కన్వీనర్ మాకా అశోక్‌కుమార్, మాజీ అధ్యక్షులు సాయిబాబా, మహిళా విభాగం అధ్యక్షులు సరోజ తదితరులు పాల్గొన్నారు.

నిరంతరం సామాజిక సేవలో..



'ఆకలితో అలమటించే వారికి ఆధ్యాత్మిక ప్రబోధలు చేయకండి.. పట్టెడన్నం పెట్టండి'. దైవ స్వరూపం అన్నమే అని ఉద్బోధించారు భగవాన్ సత్యసాయి. ఆయన బోధన మేరకు.. నిర్భాగ్యులకు నిత్యం అన్నప్రసాద పంపిణీ జరుగుతుంది. అలాగే అనేక ఆధ్యాత్మిక సేవా కార్యాక్రమాలు నిర్వహిస్తున్నాం. కుల, మతాలకు అతీతంగా అన్ని వర్గాల పండుగలు జరుపుకోవడం ఇక్కడి ప్రత్యేకత. సాయి భక్తుల దాతృత్వం, ఆర్థిక తోడ్పాటు, సహకారంతో నిత్యాన్నదానం, అమృత కలశం, బాలవికాస్, మహిళా వికాస్ తదితర విభాగాల ద్వారా నిరంతరాయంగా సేవలు కొనసాగిస్తున్నాం. ఎక్కడ ఏ కష్టం వచ్చినా సాయి సేవకులుగా ముందుంటాం.

– మాకా అశోక్‌కుమార్, కన్వీనర్, సత్యసాయి సేవా సమితి

స్వచ్ఛందంగా సేవా కార్యక్రమాలు



సామాజిక సేవలో పాల్గొనడం భగవాన్ సత్యసాయిబాబా ఇచ్చిన అదృష్టంగా భావిస్తున్నాం. సేవా సమితి ద్వారా మూడు దశాబ్దాలకు పైగా సేవలు అందిస్తున్నాం. వందల మంది సేవకులు ప్రత్యక్షంగా, పరోక్షంగా భాగస్వాములు అవుతూ తమ వంతు బాధ్యతను నిర్వర్తిస్తున్నారు. మహిళలు కూడా స్వచ్ఛందంగా పాల్గొంటున్నారు. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటే మనసు చాలా ప్రశాంతంగా ఉంటుంది.

– సాయి సంధ్య, జిల్లా సేవాదళ్ ఇన్‌చార్జ్

రగ్బీలో సత్తా చాటాలి



క్రీడాకారులకు టీషర్టులు పంపిణీ చేసిన ఎస్‌జీఎఫ్ నాయకులు

కర్నూలు (టౌన్): ఈ నెల 23వ తేదీన కాకినాడలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ రగ్బీ పోటీల్లో ప్రతిభ చాటాలని జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి గిడ్డయ్య క్రీడాకారులకు సూచించారు. శుక్రవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో రాష్ట్ర పోటీలో పాల్గొనే క్రీడాకారులకు టీషర్టులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చిన అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. అండర్-14 బాలికల జట్టు మంచి ప్రతిభ చాటిందని, అదే తరహాలో అండర్-17 జట్టు విజయం సాధించాలన్నారు. రగ్బీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, ఎస్‌జీఎఫ్ సహాయ కార్యదర్శి సుంకారావు, వ్యాయామ ఉపాధ్యాయులు బాషా పాల్గొన్నారు.

కలెక్టరేట్ ముట్టడికి పిలుపు

కర్నూలు(సెంట్రల్): రైతులు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 26వ తేదీన చేపట్టనున్న కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఎం నగర కార్యదర్శి టి.రాముడు పిలుపునిచ్చారు. శుక్రవారం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో పలు కార్మిక సంఘాల నాయకులను కలిసి కార్మిక-రైతు ఉద్యమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులు, రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నారు. వెంటనే కనీస మద్దతు ధర చట్టాన్ని చేయాలన్నారు. 44 లేబర్ చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. నాయకులు సీహెచ్ సాయిబాబా, నరసింహులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక పూజలు

కర్నూలు కల్చరల్: కార్తీక మాసం శుక్రవారాన్ని పురస్కరించుకొని నగరంలోని పలు శివాలయాలు, అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సూర్యనారాయణ స్వామి ఆలయంలోని మహా గౌరీ అమ్మవారి సన్నిధిలో రాహుకాల, దుర్గా పూజ, లలిత సహస్రనామ పారాయణం తదితర పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.



సామూహిక పూజల్లో మహిళలు

పొలంబడి రికార్డుల తనిఖీ

కర్నూలు(అగ్రికల్చర్): గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీస్ (గ్యాప్) కింద సాగు చేస్తున్న పంటలకు సంబంధించిన రికార్డులను పరిశీలించే కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. అన్ని మండలాల్లో గ్యాప్ పొలంబడి కార్యక్రమాలు జరుగుతున్నాయి. పొలంబడి కార్యక్రమానికి సంబంధించి రికార్డుల నిర్వహణ కీలకం. రికార్డులను బట్టి గ్యాప్ పొలంబడి ఎలా జరిగింది. కెమికల్స్ వాడారా లేదా అనేది తెలుస్తుంది. గుంటూరులోని వ్యవసాయ శాఖ కమిషనరేట్ నుంచి వచ్చిన ఏడీఏ వెంకటేశ్వర్లు గ్యాప్ పొలంబడి రికార్డులను పరిశీలించారు. గ్యాప్ కింద ఎక్కువ మండలాల్లో వరి, కంది పంటలు సాగు చేశారు. ఈ పంటలకు సంబంధించి రికార్డులను ఏఓలు, వీఏఏలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాల ప్రతినిధులు తెచ్చారు. వీటిని కమిషనరేట్ ఏడీఏ క్షుణంగా పరిశీలించారు. సాంకేతిక ఏఓ ఉషారాణి పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఏడీఏ వెంకటేశ్వర్లు, ఏఓ ఉషారాణి

యాంటీబయాటిక్స్ అతివాడకం అనర్థం

కర్నూలు(హాస్పిటల్): అవసరానికి మించి యాంటీబయాటిక్స్ మందులు వాడటం అనర్థదాయకమని కర్నూలు మెడికల్ కాలేజీ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిచరణ్ అన్నారు. కాలేజీలోని మైక్రోబయాలజీ విభాగం ఆధ్వర్యంలో ×యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ అవగాహన వారోత్సవాలను పురస్కరించుకుని మైక్రో బయాలజీ విభాగం, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో వైద్య విద్యార్థులు బ్లూ కలర్ బెలూన్స్, డ్రస్‌లు ధరించి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ హరిచరణ్ మాట్లాడుతూ.. విపరీతంగా యాంటీ మైక్రోబియల్ మందులు వాడటం వల్ల రెసిస్టెన్స్ ఏర్పడి సదరు వ్యాధులకు ఆ మందులు పనిచేయకుండా పోతాయన్నారు. మైక్రోబయాలజీ విభాగం హెచ్ఓడీ డాక్టర్ రేణుకాదేవి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిసుధీర్, డాక్టర్లు అరుణ, నాగజ్యోతి, విజయలక్ష్మి, శరణ్య, ప్రవీణ పాల్గొన్నారు.

పెయ్య దూడలకు బ్రూసెల్లోసిస్ టీకాలు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి జిల్లాలో పెయ్య దూడలు ఆరోగ్యంగా పెరిగేందుకు వ్యాక్సినేషన్ కార్యక్రమం శుక్రవారం నుంచి ప్రారంభమైంది. మూడు నెలల వయస్సు పైబడిన పెయ్య (ఆడ) దూడలకు బ్రూసెల్లోసిస్ వ్యాక్సిన్ వేయించడానికి పశుసంవర్ధక శాఖ చర్యలు చేపట్టింది. మూడు విడతల్లో ఈ వ్యాక్సిన్ వేస్తారు. ప్రస్తుతం రెండవ విడత జరుగుతోంది. మూడవ విడత వాక్సినేషన్ వచ్చే మార్చిలో జరుగుతుందని ఉమ్మడి జిల్లా పశువ్యాధి నిర్ధారణ కేంద్రం సహాయ సంచాలకులు డాక్టర్ రవి బాబు తెలిపారు. అన్ని డివిజన్‌లకు వ్యాక్సిన్ సరఫరా చేసినట్లు పేర్కొన్నారు.

బెంచ్ వద్దు.. హైకోర్టు ఇవ్వండి



బార్ అసోసియేషన్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న న్యాయవాదులు

కర్నూలు (లీగల్): రాష్ట్ర ప్రభుత్వం కర్నూలులో హైకోర్టు బెంచ్ కాకుండా ప్రిన్సిపాల్ హైకోర్టును ఏర్పాటు చేయాలని కర్నూలు న్యాయవాదులు డిమాండ్ చేశారు. స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయం ఎదుట శుక్రవారం వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ నాయకులు సువర్ణా రెడ్డి, సుబ్బయ్య, రాజేష్ ఆధ్వర్యంలో న్యాయవాదులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాయలసీమకు అన్యాయం చేస్తూ గతంలో మాదిరి అభివృద్ధి అంతా ఒకే చోట కేంద్రీకరించడం తగదన్నారు. సీమకు హైకోర్టు ఇచ్చే వరకు పోరాటం చేస్తామన్నారు.

ఎస్పీని కలిసిన బ్రాహ్మణ నేతలు

కర్నూలు(అర్బన్): నగర బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీన నిర్వహించనున్న కార్తీక వనభోజన మహోత్సవానికి హాజరు కావాలని జిల్లా ఎస్పీ బింధుమాధవ్‌ను ఆహ్వానించారు. శుక్రవారం నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నేతలు ఎస్పీని కలిసి శాలువా కప్పి, ఆశీర్వచనాలు అందించారు. సండేల్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. స్థానిక సంకల్‌బాగ్‌లోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయం, భవానీ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయం ప్రాంగణంలో వనభోజన మహోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎస్పీని కలిసిన వారిలో నగర బ్రాహ్మణ సంఘం గౌరవాధ్యక్షులు చెరువు దుర్గాప్రసాద్, సముద్రాల శ్రీధర్, రవిచంద్ర శర్మ తదితరులు ఉన్నారు.



జిల్లా ఎస్పీ బిందుమాధవ్‌ను కలిసిన బ్రాహ్మణ సంఘం నేతలు

ఘనంగా ఫిజియాలజీ వారోత్సవాలు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీలో ప్రపంచ ఫిజియాలజీ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఫిజియాలజి డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఈ నెల 18 నుంచి 22వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగించారు. 19న ఇందిరాగాంధీ మెమోరియల్ స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు, 21న మెడికల్ కాలేజీ విద్యార్థులకు క్విజ్ పోటీలు, 22న పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఫిజియాలజీ విభాగం మొదటి హెచ్‌ఓడీ డాక్టర్ సి.వెంకటరామయ్య విగ్రహానికి ప్రిన్సిపాల్ హరిచరణ్, వైస్ ప్రిన్సిపాల్ సాయిసుధీర్, హెచ్‌ఓడీ అమీరున్నీసాబేగం పూలమాలవేసి స్మరించుకున్నారు.

బహుజనులకు స్ఫూర్తి ఝల్కారీబాయి

కర్నూలు(అర్బన్): బహుజనులకు వీరనారి ఝల్కారీబాయి స్ఫూర్తిగా నిలిచారని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళా ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి అన్నారు. శుక్రవారం ఝల్కారీబాయి జయంతి సందర్భంగా స్థానిక వేదిక ప్రధాన కార్యాలయంలో ఆమె చిత్రపటానికి మహిళా నేతలు పూలమాల వేసి నివాళులర్పించారు. వేదిక రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి, జిల్లా అధ్యక్షురాలు పాలెం రాధ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

కర్నూలు(హాస్పిటల్): ప్రజలు తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని డెమో శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం స్థానిక ఎర్రబురుజు పీహెచ్‌సీ పరిధిలోని ఖల్ల వీధిలో ఫ్రైడే - డ్రైడే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కీటక జనిత వ్యాధులపై, పరిసరాల శుభ్రత గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే - డ్రైడే పాటిస్తే దోమలను గుడ్లు, లార్వా, ప్యూపా దశలోనే నిర్మూలించవచ్చన్నారు. డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, ఆరోగ్య విద్యాబోధకురాలు పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

హంద్రీనీవా ఎస్ఈగా ఏవీ సురేష్‌బాబు

కర్నూలు (సిటీ): హంద్రీనీవా సుజల స్రవంతి పథకం సర్కిల్-1 పర్యవేక్షక ఇంజినీర్‌గా ఎ.వెంకటసురేష్ బాబును నియమించారు. ప్రస్తుతం ఈయన ఎస్ఆర్‌బీసీ సర్కిల్-2 డివిజన్-3 ఈఈగా పనిచేస్తున్నారు. హంద్రీనీవా పర్యవేక్షక ఇంజినీర్‌గా ప్రస్తుతం డి.రాంగోపాల్ పనిచేస్తున్నారు. ఆయనను ఎక్కడికి బదిలీ చేస్తున్నారో స్పష్టత ఇవ్వలేదు. ఆయన రిలీవ్ అయిన తర్వాత సురేష్‌బాబు బాధ్యతలు స్వీకరించనున్నారు. అలాగే హంద్రీనీవా డిప్యూటీ ఎస్ఈగా అనంతపురం సర్కిల్ కార్యాలయంలో పనిచేస్తున్న పి.ఉషారాణిని నియమించారు.

హెచ్ఎన్ఎస్ఎస్ యూనిట్-3 ఎస్‌డీసీ నియామకం

కర్నూలు (సెంట్రల్): హంద్రీనీవా సుజల స్రవంతి యూనిట్-3 స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతతో ఎస్.చిరంజీవిని నియమించారు. ప్రస్తుతం ఈయన జాతీయ రహదారుల ఎస్‌డీసీగా పనిచేస్తున్నారు. అంతేకాక గృహ నిర్మాణ శాఖ పీడీగా కూడా ఎఫ్ఏసీ బాధ్యతలతో విధులు నిర్వహిస్తున్నారు. కాగా, హెచ్ఎన్ఎస్ఎస్ యూనిట్-3 ఎస్‌డీసీగా ఉన్న విశ్వనాథ్ నంద్యాలకు బదిలీ కావడంతో ఆయన స్థానంలో చిరంజీవిని నియమించారు.

వలసలు నివారించేలా కృషి

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు కల్పించి వలసలు నివారించాలని జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటరమణయ్య సాంకేతిక సహాయకులకు సూచించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పీడీని జిల్లా టెక్నికల్ అసిస్టెంటు అసోసియేషన్ ప్రతినిధులు ఆయన చాంబరులో మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే సమర్పించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ... టెక్నికల్ అసిస్టెంట్లకు పలు సూచనలు చేశారు. రానున్న రోజుల్లో ఉపాధి పనులకు డిమాండ్ ఎక్కువగా ఉంటుందని, అవసరమైన పనులు గుర్తించి సిద్ధంగా ఉండాలన్నారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తిరుమలేష్ మాట్లాడుతూ.. జిల్లాలో టెక్నికల్ అసిసెంట్లు ఎదుర్కొంటున్న సమస్యలను పీడీ దృష్టికి తెచ్చారు. అసోసియేషన్ నాయకులు బషీర్, వెంకటేష్, మహేష్, ఆనంద్, కేశవ, మల్లికార్జున తదితరులు ఉన్నారు.

అనధికార షాపులను తొలగించండి

కర్నూలు (టౌన్): మద్యం దుకాణాల పక్కన అనధికారికంగా షాపులను ఏర్పాటు చేసి బార్లుగా మార్చారని, అలాంటి వాటిని తొలగించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం డిమాండ్ చేశారు. పార్టీ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి, నగర సహాయ కార్యదర్శులు మహేష్, శ్రీనివాసరావులతో కలిసి శుక్రవారం ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. నగరంలో మద్యం దుకాణాల వద్ద ఎలాంటి అనుమతులు లేకుండా పర్మిట్ రూమ్‌లు ఏర్పాటు చేసి బార్లుగా మార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. కృష్ణానగర్, గుత్తి రోడ్డు, ఐటీసీ సర్కిల్, మద్దూర్‌నగర్, కొత్తబస్టాండ్, శ్రీనివాసనగర్‌లో మందుబాబులు రోడ్ల మీదే మద్యం తాగుతుండడంతో అటు వైపు వెళ్లే వాహనదారులు, మహిళలు, పాదాచారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనధికారికంగా నిర్వహిస్తున్న షాపులను బంద్ చేయించాలని డిమాండ్ చేశారు

ఏకగ్రీవంగా స్టాంటన్ చర్చి ఎన్నికలు

కర్నూలు (టౌన్): స్థానిక శ్రీనివాసనగర్‌లో ఉన్న స్టాంటన్ స్మారక తెలుగు బాప్టిస్టు చర్చి సంఘంలో శుక్రవారం ఎన్నికలు నిర్వహించారు. నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల పరిశీలకులు ఎస్.చంద్రశేఖర్ వెల్లడించారు. స్థానిక చర్చిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..నూతన కార్యవర్గంలో 10 మంది కమిటీని ఎన్నుకున్నట్లు చెప్పారు. ఎం.ఎల్.గ్లోరీప్రకాష్ (జనరల్ బాడీ చైర్మన్), రవిచంద్రకాంత్ (కార్యదర్శి), డేవిడ్ పాల్ (కోశాధికారి), జాన్ జోయల్ (స్టాండింగ్ కమిటీ కార్యదర్శి), రాజశేఖర్, సరోజమ్మ (సీనియర్ డీకాన్), బేబీరాణి (సండే స్కూల్ సూపరింటెండెంట్), పి.వసుంధర దేవి (యూత్ డైరెక్టర్), జి.జోసెఫ్ మనోహర్ (ప్రాపర్టీ కమిటీ చైర్మన్), ఎం.దేవకృప (మహిళా అసోసియేషన్ అధ్యక్షులు)గా ఎన్నికయ్యారు. వీరంతా ఈనెల 24వ తేదీ ప్రమాణ స్వీకారం చేస్తారని ఆయన వెల్లడించారు. సమావేశంలో ప్రస్తుత చైర్మన్ గిడియోన్, కృపాదానం, ప్రభాకర్ పాల్గొన్నారు.

ఆయుధాల వినియోగంపై శిక్షణ

కర్నూలు (టౌన్): పోలీసు అధికారులు, సిబ్బంది తమ విధుల్లో వినియోగించే ఆయుధాలపై పూర్తి అవగాహన కలిగిఉండాలని జిల్లా ఎస్పీ బిందుమాధవ్ సూచించారు. శుక్రవారం కర్నూలు మండలం దిన్నెదేవరపాడు సమీపంలోని జగన్నాథగట్టు వద్ద ఫైరింగ్ ప్రాక్టీస్ నిర్వహించారు. వార్షిక ఫైరింగ్ ప్రాక్టీసులో పాల్గొన్న ఎస్పీ ఆయుధాలను పరిశీలించారు. ఏకే- 47, ఏఎల్ఆర్ పిస్టల్‌తో ఫైరింగ్ సాధన చేశారు. ఎస్పీ మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసుల సేవలు కీలకమన్నారు. అత్యవసర సమయాల్లో ప్రజల మాన, ధన, ప్రాణ రక్షణకు ఎల్లవేళలా సంసిద్ధులై ఉండాలన్నారు. ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, డీఎస్పీ బాబుప్రసాద్, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు ప్రసాద్, కేశవ రెడ్డి, ఆర్ఐలు పాల్గొన్నారు.